సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
సోమవారం । 23 । జూన్ । 2025



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి చెన్నైకి చెందిన ఎం.గిరిధర్‌రెడ్డి దంపతులు రూ.1,00,001 విరాళాన్ని ఆదివారం సమర్పించారు. ఏటా జూన్ 13న అన్నదానం చేయాలని కోరారు.




అమ్మో కర్రంటోళ్లు...

8లో

నిత్య జీవితంలో విద్యుత్ ఓ భాగమైంది.. ఏ పనికైనా ఇది అత్యవసరమైంది.. అలాంటి విద్యుత్ చార్జీలను కూటమి ప్రభుత్వం పెంచి ప్రజల నడ్డివిరిస్తోంది..

డెల్టా కాలువలకు 12,100 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: ఖరీఫ్ సాగుకు సంబంధించి ఆదివారం గోదావరి డెల్టా కాలువలకు 12,100 క్యూసెక్కుల నీటిని వదిలారు. తూర్పు డెల్టాకు 3,800, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 6,000 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 9.25 అడుగుల వద్ద నీటిమట్టం నెలకొంది.

న్యూస్‌రీల్

నేడు 'యువత పోరుకు' తరలిరండి

- వైఎస్సార్ సీపీ జిల్లా యువజన, విద్యార్థి విభాగాల పిలుపు




సమీక్షిస్తున్న యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సూర్యప్రకాష్, శ్రీకాంత్, శ్రీనివాసరావు

అమలాపురం టౌన్: విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ చెల్లించకుండా, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకుండా కూటమి ప్రభుత్వం సాగిస్తున్న అరాచక పాలనకు నిరసనగా అమలాపురం కలెక్టరేట్ వద్ద 'విద్యార్థి – యువత పోరు' పేరుతో సోమవారం ఉదయం జరగనున్న నిరసన కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ జిల్లా యువజన, విద్యార్థి విభాగాలు ఏర్పాట్లు చేశాయి. ఈ నిరసనకు పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు, రామచంద్రపురం నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్, జిల్లా పార్టీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు మిండగుదటి శిరీష్‌లు నాయకత్వం వహిస్తున్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పార్టీ కోఆర్డినేటర్లతో పాటు ఆ రెండు విభాగాల జిల్లా అధ్యక్షులు యువత పోరు విజయవంతానికి వారం రోజులుగా కసరత్తు చేస్తున్నారు. ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, పార్లమెంట్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పినిపే విశ్వరూప్, జిల్లా పార్టీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి తదితర పార్టీ జిల్లా పెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. సోమవారం ఉదయం 9 గంటలకు జిల్లా కలెక్టరేట్ సమీపంలోని వంటెద్దు వెంకన్నాయుడు షాపింగ్ కాంప్లెక్స్ వద్దకు జిల్లా నలుమూలల నుంచి వచ్చే పార్టీ శ్రేణులు, యువతీ యువకులు, విద్యార్థులు చేరుకోవాలని మిండగుదటి శిరీష్ విజ్ఞప్తి చేశారు. ఆ కాంప్లెక్స్ నుంచి పాదయాత్రగా కలెక్టరేట్‌కు చేరుకుని యువత పోరుతో నిరసన తెలిపి కలెక్టర్‌కు వినతి పత్రం అందించనున్నట్లు ఆయన వివరించారు.

ఏర్పాట్లపై సమీక్ష

వైఎస్సార్ సీపీ విద్యార్థి– యువత పోరు ఏర్పాట్లపై పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు పిల్లి సూర్యప్రకాష్ జిల్లా పార్టీ నాయకులతో ఆదివారం సాయంత్రం సమీక్షించారు. కలెక్టరేట్ సమీపంలోని పార్టీ నాయకుడు వంటెద్దు వెంకన్నాయుడు షాపింగ్ కాంప్లెక్స్ వద్ద నిర్వహించిన ఈ సమావేశంలో సూర్యప్రకాష్ మాట్లాడారు. అమలాపురం, పి.గన్నవరం నియోజకవర్గాల పార్టీ కో ఆర్డినేటర్లు డాక్టర్ పినిపే శ్రీకాంత్, గన్నవరపు శ్రీనివాసరావు సమావేశంలో పాల్గొని యువత పోరు విజయవంతానికి సమాలోచనలు చేశారు. జిల్లా పార్టీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు మిండగుదటి శిరీష్ సమావేశంలో పలు సూచనలు చేశారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, జిల్లా పార్టీ ఐటీ విభాగం అధ్యక్షుడు తోరం గౌతమ్ రాజా, నాయకుడు వంటెద్దు వెంకన్నాయుడు, అమలాపురం మండల పార్టీ యువత అధ్యక్షుడు కేతా భానుతేజ పాల్గొన్నారు.

కూటమి వైఫల్యాలను ఎండగడదాం..



ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్

అల్లవరం: ప్రతి ఏడాది క్రమం తప్పకుండా జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఉద్యోగాలు కల్పిస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులను నిలువునా మోసం చేసిందని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ విడుదల చేసినా తర్వాత ప్రక్రియ ముందుకు సాగలేదన్నారు. ప్రతి నెలా రూ. 3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి, ఇప్పటి వరకూ పట్టించుకోలేదని అన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్ ముందు యువత పోరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్సీ తెలిపారు. ఇందులో పెద్దఎత్తున యువత పాల్గొని కూటమి వైఫల్యాలను ఎండగట్టాలని కోరారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

అమలాపురం రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం ఉదయం 10 గంటల నుంచి అమలాపురం కలెక్టరేట్ గోదావరి భవన్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు నేరుగా తమ సమస్యలపై అర్జీలు అందించవచ్చని అన్నారు. అలాగే 1100 కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదులు తెలపడంతో పాటు, గత ఫిర్యాదుల పరిష్కార స్థితిని తెలుసుకోవచ్చన్నారు. మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో కూడా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

ఏడాదిలో యువేత

- కూటమి ప్రభుత్వంలో నిండా మోసం
- విద్యార్థులకు అందని రీయింబర్స్‌మెంట్
- నిరుద్యోగికి ఉపాధి లేదు.. భృతి అందదు
- నేడు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో 'విద్యార్థి – యువత పోరు'
- అమలాపురం కలెక్టరేట్ వద్ద ధర్నా



అమలాపురంలో కలెక్టరేట్ వద్ద ఎండీయూ ఆపరేటర్ల నిరసన (ఫైల్)

సాక్షి, అమలాపురం: 'చంద్రబాబు' అంటే అంతే. నమ్మిన వారిని నిలువునా ముంచేస్తారు. ఎన్నికలు ముగిసిన వెంటనే హామీలను మరిచిపోతారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలన కూడా అంతే.. చేసేది మూరెడు.. ప్రచారం బారెడు అన్నట్టు సాగిపోతోంది. ఏడాదిగా ఇటు విద్యార్థులు, అటు నిరుద్యోగులు మోసపోతూనే ఉన్నారు. ఊరించి ఊరించి ఇచ్చిన 'తల్లికి వందనం'లో అర్హులకు కోత పెట్టారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా, వసతి దీవెన ఊసే లేదు. పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక సదుపాయాలు లేవు. ఇక నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి లేదు.. ఉద్యోగ, ఉపాధి కల్పించలేదు. పరిశ్రమల ఏర్పాటు.. కార్పొరేషన్ రుణాలు.. ఇలా అన్ని విషయాల్లోనూ యువతను ప్రభుత్వం మోసం చేస్తూనే ఉంది. ఏడాది పాలనలో విద్యార్థులు, నిరుద్యోగులను కూటమి ప్రభుత్వం మోసగించడంతో వైఎస్సార్ సీపీ సమర శంఖారావం పూరించింది. సోమవారం అమలాపురం కలెక్టరేట్ వద్ద 'విద్యార్థి – యువత పోరుకు సిద్ధమైంది.

ఎక్కడి పనులు అక్కడే..

- ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతోంది. పాఠశాలలు పునః ప్రారంభించే సమయానికి పూర్తి కావాల్సిన మనబడి మన భవిష్యత్తు రెండో దశ పనులు అక్కడివి అక్కడే అన్నట్లు ఉన్నాయి. మనబడి మన భవిష్యత్తు రెండో దశలో పాఠశాలల్లో నిరంతరం నీటి సరఫరాతో కూడిన టాయిలెట్ల నిర్మాణం, తరగతి గదుల్లో ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు, తాగునీటి సరఫరా, ఆకట్టుకునేలా పాఠశాలల ప్రహరీలపై పెయింటింగ్స్, భవనాల మరమ్మతులు, గ్రీన్ చాక్ బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉంది. రెండో దశ పనుల్లో భాగంగా 772 పాఠశాలలను రూ.257 కోట్లతో అభివృద్ధి చేయాల్సి ఉండగా, చాలా చోట్ల సిమెంట్, ఇసుక కొరతతో పనులు నిలిచిపోయాయి.
- తల్లికి వందనం పథకాన్ని ఒక ఏడాది ఎగ్గొట్టిన కూటమి ప్రభుత్వం రెండో ఏడాది లబ్ధిదారులకు భారీగా కోత పెట్టింది. జిల్లాలో 2.40 లక్షల మంది లబ్ధిదారులు ఉండగా, 1,70869 మందికి మాత్రమే తల్లికి వందనం పడింది. ఇంకా 63,191 మందికి సొమ్ము పడాలి. పలు నిబంధనల పేరుతో ఈ పథకాన్ని దూరం చేసింది.
- జిల్లాలో నాడు – నేడు రెండో దశలో 761 పాఠశాలలను అభివృద్ధి చేయాలి. ఇందుకు రూ.249 కోట్లు మంజూరు కావాల్సి ఉండగా, రూ.86 కోట్లు రివాల్వింగ్ ఫండ్, రూ.61 కోట్లు సీపీఎం (సెంట్రల్లీ ప్రొక్యూర్డ్ మెటీరియల్)కు మంజూరయ్యాయి. మొత్తం రూ.147 కోట్లు విడుదలయ్యాయి. ఇంకా రివాల్వింగ్ ఫండ్, సీపీఎం రూపేణా రూ.102 కోట్లు విడుదల కావాలి. 267 అదనపు తరగతి గదులకు 223 పనులు వివిధ దశల్లో ఉండగా, 25 ఏసీఆర్‌లు ప్రారంభించ లేదు. 19 ఏసీఆర్‌లు పూర్తయ్యాయి. అధిక సంఖ్యలో పాఠశాలలకు సిమెంట్ రావాల్సి ఉంది.
- పాఠశాలల్లో కొత్తగా 546 టాయిలెట్స్ నిర్మిస్తుండగా 278 వివిధ దశల్లో ఉన్నాయి. 267 చోట్ల పూర్తయ్యాయి. అలాగే 403 కిచెన్ షెడ్లు మంజూరు కాగా, 235 వివిధ దశల్లో ఉండగా, 167 పూర్తయ్యాయి. మేజర్, మైనర్ మరమ్మతులకు 1,012 పనులు మంజూరు కాగా 576 పనులు వివిధ దశల్లో ఉన్నాయి. 548 పాఠశాలల్లో విద్యుద్దీకరణ పనులు మంజూరు చేయగా, 162 పాఠశాలల్లో వివిధ దశల్లో ఉన్నాయి.
- **గత ప్రభుత్వ హయాంలో విద్యాదీవెన కింద 8,824 మంది విద్యార్థులకు రూ.8.14 కోట్లు విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత దీని పేరు రీయింబర్స్‌మెంట్ ఆఫ్ ట్యూషన్ ఫీజు (ఆర్‌టీఎఫ్)గా మార్చి 2024–25** సంవత్సరానికి 7,210 మందికి రూ.8.33 కోట్లు విడుదల చేశారు. అలాగే వసతి దీవెన పథకం పేరును మెయింటెనెన్స్ ఆఫ్ ట్యూషన్ ఫీజు (ఎంటీఎఫ్)గా మార్చి రూ.1.39 కోట్లు మంజూరు చేశారు. తరువాత నుంచి ఒక్క పైసా కూడా విడుదల చేయలేదు. దీనిపై ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు ఆందోళన బాట పట్టాయి.



తల్లికి వందనం రాక అమలాపురంలో విద్యుత్ కార్యాలయం వద్ద లబ్ధిదారుల పాట్లు (ఫైల్)



వసతి, విద్యాదీవెన అందించాలని కలెక్టర్‌కు వినతి ఇస్తున్న ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు (ఫైల్)

ఉన్న ఉద్యోగాలే పీకేశారు



కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది అవుతోంది. రీయింబర్స్‌మెంట్ 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఒక్క రూపాయి కూడా అందించలేదు. యువతకు ఇస్తానన్న నిరుద్యోగ భృతి ఇవ్వడం లేదు. కొత్త ఉద్యోగాలు దేవుడెరుగు, ఈ ఏడాదిలో నాలుగు లక్షల ఉద్యోగాలు పీకేశారు. వీటిపై నిరసన తెలిపేందుకు సోమవారం అమలాపురంలో కలెక్టరేట్ వద్ద విద్యార్థి, యువత పోరు నిర్వహిస్తున్నాం. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు చేస్తున్న ఈ ఆందోళనలో విద్యార్థులు, యువత స్వచ్ఛందంగా పాల్గొనాలి.

–పిల్లి సూర్యప్రకాష్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు

అన్నింటా దగా..

- **నిరుద్యోగ భృతిని కూ**టమి ప్రభుత్వం మరిచి **పోయింది. 2014**లో టీడీపీ ఎన్నికల **మేనిఫెస్టోలో ఈ హామీ** ఇచ్చి కేవలం ఒక్క నెల **మాత్రమే అప్పట్లో** ఇచ్చింది. ఇప్పుడు టీడీపీ **సూపర్ సిక్స్ పథకంలో** దీనిని మళ్లీ ఓ హామీగా **చేర్చింది. గెలిచి** ఏడాది అవుతున్నా ఆ హామీ **నెరవేర్చకుండా నిరుద్యో**గ యువతను చంద్ర**బాబు ప్రభుత్వం రెండో**సారి మోసం చేసింది. **జిల్లాలో సుమారు 20** వేల మంది నిరుద్యోగ **యువత ఉంటోందని** అంచనా. వీరికి నెలకు **రూ.మూడు వేల చొ**ప్పున ఏడాదిలో రూ.36 **వేలు వేయాల్సి ఉంది**. మొత్తం మీద ఏడాదిలో **సుమారు రూ.72 కోట్ల**కు ఎగనామం పెట్టింది.
- కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉన్న ఉద్యోగాలు తీసివేసి పలువురిని నిరుద్యోగులుగా మార్చింది. వలంటీర్ వ్యవస్థను మొత్తం ఎత్తేసింది. జిల్లాలో పట్టణ, గ్రామ స్థాయిలో సుమారు 9,900 మందిని తొలగించింది. ఇంటింటా రేషన్ అందించే ఎండీయూ వ్యవస్థను నిలిపివేసింది. జిల్లాలో 370 వాహనాలు నిలిపివేయడంతో 740 మంది ఉపాధికి గండి కొట్టింది.
- చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన సమయంలో తొలి సంతకాల్లో ఒకటి మెగా డీఎస్సీ. తొలి సంతకం కార్యరూపం దాల్చడానికి ఏడాది సమయం పట్టింది. పరీక్షలైతే జరిగాయి. వెంటనే కొలువులు ఇస్తారనే నమ్మకం అభ్యర్థులకు కలగడం లేదు.
- జిల్లాలో ఎస్సీ, బీసీ, కాపు, ఇతర సామాజిక వర్గాలకు అడిగిన వారికి అడిగిన అన్ని రుణాలిస్తామన్నారు. దీని ద్వారా లబ్ధి పొందేది ఎక్కువగా యువతే. కూటమి నేతల మాటలు నమ్మి, స్వయం ఉపాధి పొందవచ్చనే ఆశతో వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. నియోజకవర్గంలో అన్ని సామాజిక వర్గాలకు కలిపి అన్ని కార్పొరేషన్ల నుంచి 120 యూనిట్లు కేటాయించారు. వీటి కోసం 1,500 నుంచి 2,500 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికీ అనుమతులు ఇవ్వలేదు.

అప్పులు చేసి ఫీజులు



రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన, విద్యా దీవెన సొమ్ము సకాలంలో విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. తల్లిదండ్రులు అప్పులు చేసి ఫీజులు చెల్లిస్తున్నారు. ఇటువంటి పరిస్థితి 2004కు ముందు చూశాం. ఇప్పుడు మరోసారి చూస్తున్నాం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇచ్చినట్టు వసతి, విద్యా దీవెన క్రమం తప్పకుండా అందించాలి.

–మిండగుదిటి శిరీష్ నారాయణస్వామి, వైఎస్సార్ సీపీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు

రండి.. ఒలింపిక్ రన్‌కు..



టీ షర్ట్‌లను ఆవిష్కరిస్తున్న అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సాత్విక్ సాయిరాజ్, జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: అందరూ ఆరోగ్యంగా ఉండాలంటే.. రండి కలసి పరుగెడదామనే నినాదంతో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అమలాపురం పట్టణంతో పాటు జిల్లాలోని 22 మండల కేంద్రాల్లో సోమవారం ఉదయం ఒలింపిక్ రన్‌లు నిర్వహిస్తోంది. దీనిపై స్థానిక దుడ్డివారి అగ్రహారంలోని ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్‌లో జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు అల్లాడ శరత్‌బాబు అధ్యక్షతన ఆదివారం సమావేశం జరిగింది. అమలాపురానికి చెందిన అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తన తండ్రి దివంగత, విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్, ఆఫీసర్స్ క్లబ్ కార్యదర్శి రంకిరెడ్డి కాశీ విశ్వనాథ్ ఆధ్వర్యంలో గత 25 ఏళ్లుగా అమలాపురంతోపాటు మండల కేంద్రాల్లో ఒలింపిక్ రన్‌లను నిర్వహించారని గుర్తు చేశారు. ఈ ఏడాది తన తండ్రి భౌతికంగా దూరమైనా ఆయన ఆశయాన్ని కొనసాగిస్తూ జిల్లా ఒలింపిక్ రన్ స్ఫూర్తిని కొనసాగించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు శరత్‌బాబు, కార్యనిర్వాహక కార్యదర్శి పప్పుల శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ సోమవారం ఉదయం 8 గంటలకు ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ నుంచి రన్‌ను కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఒలింపిక్ టార్చ్‌ను వెలిగించి ప్రారంభిస్తారన్నారు. ఈ రన్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ధ్రువీకరణ పత్రం అందిస్తామన్నారు. ఈ సందర్భంగా రన్‌లో అందజేయనున్న ఒలింపిక్ టీషర్టులను సాయిరాజ్, జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు ఆవిష్కరించారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రతినిధులు కల్వకొలను బాబు, తిక్కిరెడ్డి సురేష్, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు కట్టా పురుషోత్తం, గొలకోటి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లి... భక్తులతో శోభిల్లి



అయినవిల్లిలో అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో శోభిల్లింది. తొలుత ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావు ఆధ్వర్యంలో స్వామివారికి మేలుకొలుపు సేవ, పంచామృతాభిషేకాలు, ఏకాదశ, లఘున్యాస పూర్వక అభిషేకాలు, శ్రీలక్ష్మీ గణపతి హోమం, గరిక పూజ జరిపారు. అనంతరం స్వామివారిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. లఘున్యాస ఏకాదశ రుద్రాభిషేకాల్లో 43 మంది, లక్ష్మీగణపతి హోమంలో 32 జంటలు, పంచామృతాభిషేకాల్లో ముగ్గురు జంటలు పాల్గొన్నాయి. పది మంది చిన్నారులకు అక్షరాభ్యాసం, ఎనిమిది మందికి తులాభారం, ముగ్గురికి అన్నప్రాసన జరిగాయి. 33 మంది వాహన పూజలు చేయించుకున్నారు. 2,600 మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. ఆదివారం ఒక్క రోజు ఆలయానికి వివిధ పూజా టిక్కెట్లు, అన్నదాన విరాళాలుగా రూ.3,51,790 ఆదాయం సమకూరిందని ఆలయ ఇన్‌చార్జి ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ అల్లు వెంకటదుర్గ భవాని తెలిపారు.

భద్రతా ప్రమాణాలు పాటించకపోతే చర్యలు



శ్రీనివాసరావు, జిల్లా రవాణా శాఖాధికారి

అమలాపురం రూరల్: స్కూల్ పిల్లలతో ప్రయాణించే ఆటోలు కచ్చితంగా రహదారి భద్రతా ప్రమాణాలు పాటించాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని జిల్లా రవాణా శాఖాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు హెచ్చరించారు. ఆటోల్లో స్కూల్ పిల్లలను అధికంగా ఎక్కించినా, లగేజీ పెట్టే స్థానంలో పిల్లలు, ప్రయాణికులను కూర్చోబెట్టినా మోటారు వాహనాల చట్టం కింద కేసులు నమోదు చేసి, వాహనాలను సీజ్ చేస్తామని పేర్కొన్నారు. అదే విధంగా పిల్లలను ఆటోల్లో స్కూళ్లకు పంపే సమయంలో తల్లిదండ్రులు కూడా శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ అంశాలపై త్వరలో పోలీస్, విద్యా శాఖలతో సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు.

రత్నగిరి జనసంద్రం

- సత్యదేవుని దర్శించిన 50 వేల మంది
- 2,500 వ్రతాల నిర్వహణ
- ఘనంగా సత్యదేవుని రథసేవ

అన్నవరం: రత్నగిరి ఆదివారం భక్తులతో పోటెత్తింది. వేలాదిగా వచ్చిన భక్తులు స్వామివారి దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట సమయం కేటాయించాల్సి వచ్చింది. స్వామివారి దర్శనానంతరం అనంతరం భక్తులు సప్త గోకులంలో గోవులకు ప్రదక్షిణ చేసి రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించారు. వ్రతమండపాలు, ఆలయప్రాకారం మధ్యాహ్నం వరకు భక్తులతో నిండిపోయాయి. స్వామివారిని 50 వేల మంది దర్శించగా, 2,500 వ్రతాలు నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.50 లక్షల ఆదాయం సమకూరింది. సుమారు ఐదు వేల మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. ఉదయం నుంచి వాతావరణం మేఘావృతమై ఉండడంతో భక్తులు ఆలయంలో ఉల్లాసంగా గడిపారు.

ప్రాకారసేవతో ప్రారంభించి..

ఆలయ ప్రాకారంలో ఆదివారం ఉదయం సత్యదేవుని రథసేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం పది గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకువచ్చి రథంపై ప్రతిష్ఠించి ప్రత్యేక పూజల అనంతరం ప్రాకారసేవ ప్రారంభించి రథసేవ నిర్వహించారు. సేవ అనంతరం పండితులు స్వామి, అమ్మవార్లకు నీరాజనం ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే స్వామివారి వార్షిక కల్యాణ మండపంలో ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకు సూర్యనమస్కారాలు నిర్వహించారు.



రథంపై ఆలయ ప్రాకారంలో సత్యదేవుడు, అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం

ఉపాధ్యాయుల సర్దుపాట్లు

- కౌన్సెలింగ్ కేంద్రం వద్ద ధర్నా
- దూర ప్రాంతాలకు వెళ్లేది లేదని నిరసన

రాయవరం: ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ ఉపాధ్యాయ బదిలీల అనంతరం పలు పాఠశాలల్లో ఖాళీలు ఏర్పడ్డాయి. ఆ ఖాళీలను మినిమమ్ టైమ్ స్కేల్ టీచర్ల (ఎంటీఎస్)తో సర్దుబాటు చేసేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఆదివారం కాకినాడలోని డీఈఓ కార్యాలయం వద్ద ఉమ్మడి జిల్లా కేంద్రంగా ఈ కౌన్సిలింగ్ నిర్వహించింది. అయితే తమకు బదిలీల్లో అన్యాయం జరిగిందంటూ ఎంటీఎస్ ఉపాధ్యాయులు ధర్నా చేశారు. ఆ వివరాల్లోకి వెళ్తే.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 410 మంది ఎంటీఎస్ ఉపాధ్యాయులు ఉన్నారు. ఇందులో 2008 డీఎస్సీ బ్యాచ్ 199 మంది, 1998 డీఎస్సీ బ్యాచ్‌కు చెందిన వారు 211 మంది ఉన్నారు. వీరంతా మినిమమ్ టైమ్ స్కేల్ విధానంలో జిల్లాలోని వివిధ పాఠశాలల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు.

ఎందుకు వ్యతిరేకిస్తున్నారంటే..

కాకినాడలోని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఆదివారం జరిగిన బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియను 1998, 2008 ఎంటీఎస్ ఉపాధ్యాయులు వ్యతిరేకించారు. అక్కడ ధర్నాకు దిగారు. ఇటీవల జరిగిన రెగ్యులర్ ఉపాధ్యాయుల బదిలీల అనంతరం సుదూర ప్రాంతాల్లోనే ఖాళీలు ఏర్పడ్డాయి. ఇప్పుడు నిర్వహిస్తున్న కౌన్సెలింగ్‌లో ఎంటీఎస్ ఉపాధ్యాయులంతా ప్రస్తుతం పనిచేస్తున్న ప్రాంతాలకు దూరంగా 100 నుంచి 200 కిలోమీటర్లు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీనిని వారు వ్యతిరేకించారు. అసలే అరకొర జీతాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్న తాము దూర ప్రాంతాలకు వెళ్లి ఉద్యోగాలు ఎలా చేస్తామని ఆవేదన వ్యక్తం చేశారు. తమలో 70 శాతం మంది రెండు మూడేళ్లలో ఉద్యోగ విరమణ చేయనున్నారని తెలిపారు.

వారి డిమాండ్లు ఇవీ..

కేవలం రూ.32 వేలతో పనిచేస్తున్న ఎంటీఎస్ ఉపాధ్యాయులను ప్రస్తుతం పనిచేస్తున్న మండలాల్లోనే సర్దుబాటు చేయాలి. ప్రతి మండలంలో ఉన్న మోడల్ స్కూల్స్‌లో ఒక ఎంటీఎస్ టీచర్‌ను నియమించాలి. ప్రస్తుతం ప్రభుత్వం చూపిస్తున్న ఖాళీలు నివాసాలకు 200 కి.మీ దూరంలో ఉన్నందున ప్రభుత్వం ఇచ్చే జీతం ప్రయాణ ఖర్చులకే సరిపోతుంది. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రస్తుత ఖాళీల్లో సర్దుబాటు చేయాల్సి వస్తే హెచ్‌ఆర్‌ఏ, డీఏ ఇచ్చి రెగ్యులరైజ్ చేయాలి. జిల్లా వ్యాప్తంగా ప్రతి క్లస్టర్‌లో క్లస్టర్ వేకెన్సీలు క్రియేట్ చేసి, ఎంటీఎస్ ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలి. దివ్యాంగులుగా ఉన్న ఎంటీఎస్ ఉపాధ్యాయులకు వారు కోరుకున్న మండలంలో పని చేసేందుకు అవకాశం కల్పించాలి. మున్సిపల్ పాఠశాలల్లో వేకెన్సీలను కూడా చూపించాలి. 15 నుంచి 20 మంది విద్యార్థులున్న ప్రతి పాఠశాలలో ఒక ఎంటీఎస్ ఉపాధ్యాయుడిని నియమించాలి. గతంలో విశాఖపట్నంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ ప్రకారం నియర్ బై రెసిడెన్స్ అవకాశం కల్పించాలి.

- ఇదిలా ఉంటే ఎంటీఎస్ ఉపాధ్యాయుల కౌన్సెలింగ్ ఆదివారం ఉదయం 9 నుంచి జరగాల్సి ఉండగా, వీరి ఆందోళన, చర్చల నేపథ్యంలో రాత్రి 8.30 గంటలకు మొదలైంది. ఉన్నతాధికారులు సమస్యలను పరిష్కరిస్తారని హామీ ఇవ్వడంతో వారు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు.



కాకినాడ డీఈఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఎంటీఎస్ ఉపాధ్యాయులు

ఖాళీలను పరిశీలిస్తే..

ఉమ్మడి జిల్లాలో మండలాల వారీగా పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు ఇలా.. అడ్డతీగల మండలంలో 19, అయినవిల్లి 10, అల్లవరం 19, అమలాపురం 1, అంబాజీపేట 6, అనపర్తి 1, ఆత్రేయపురం 11, బిక్కవోలు 4, చింతూరు 36, దేవీపట్నం 11, గండేపల్లి 24, గంగవరం 7, గొల్లప్రోలు 1, ఐ.పోలవరం 48, జగ్గంపేట 47, కె.గంగవరం 21, కాజులూరు 7, కపిలేశ్వరపురం 20, కాట్రేనికోన 101, కిర్లంపూడి 38, కొత్తపేట 28, కూనవరం 36, మలికిపురం 8, మామిడికుదురు 10, మండపేట 3, మారేడుమిల్లి 17, ముమ్మిడివరం 23, నెల్లిపాక 52, పి.గన్నవరం 38, పెద్దాపురం 1, ప్రత్తిపాడు 46, రాజవొమ్మంగి 5, రంపచోడవరం 22, రంగంపేట 22, రావులపాలెం 10, రాజోలు 1, రౌతులపూడి 9, సఖినేటిపల్లి 10, శంఖవరం 21, సీతానగరం 6, తాళ్లరేవు 4, తొండంగి 18, ఉప్పలగుప్తం 34, వీఆర్ పురం 42, వై.రామవరం 16, ఏలేశ్వరం మండలంలో 16 ఖాళీలు ఉన్నాయి.

క్లుప్తంగా

సమాజానికి ఉపయోగపడేలా చదవాలి

- యండమూరి వీరేంద్రనాథ్



సదస్సులో మాట్లాడుతున్న ప్రముఖ రచయిత, దర్శకుడు యండమూరి వీరేంద్రనాథ్

బోట్‌క్లబ్ (కాకినాడ): చదువుకోవడం గొప్పకాదని, అది సమాజం, పెంచిన తల్లిదండ్రులకు ఉపయోగపడేలా ఉండాలని ప్రముఖ రచయిత, దర్శకుడు యండమూరి వీరేంద్రనాథ్ అన్నారు. స్థానిక ఫ్యాబిన్ కన్వెన్షన్ హాల్‌లో కైట్ కళాశాల ఆధ్వర్యంలో ఏపీ ఎంసెట్ పరీక్షలు రాసిన విద్యార్థులకు నిర్వహించిన ఉచిత అవగాహన సదస్సు ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా యండమూరి మాట్లాడుతూ ప్రస్తుతం చాలామంది ఇంజినీరింగ్ చదువుతున్నారని, ఉద్యోగం వచ్చిన మరుసటి రోజు నుంచి తల్లిదండ్రులను మరిచిపోయేలా వారి ప్రవర్తన ఉంటుందన్నారు. దీనివల్ల చదివిన చదువుకు అర్థం ఉండదని, రేపొద్దున్న ఇదే పరిస్థితి మనకూ వస్తుందని ప్రతి ఒక్కరూ గమనించాలన్నారు. తల్లిదండ్రులు, గురువులు సమాజ మిత్రులని అన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు కైట్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ పోతుల విశ్వం అభినందనలు తెలిపారు.

అమ్మో కర్రెంటోళ్లు...

- అదనపు లోడ్ పేరుతో బాదుడు
- వీడీఎస్ ద్వారా రూ.వేలల్లో చార్జీలు
- కిలోవాట్ల వారీగా విద్యుత్ శాఖ వడ్డింపు

అమలాపురం టౌన్: నిత్య జీవితంలో విద్యుత్ ఓ భాగమైంది.. ఏ పనికైనా ఇది అత్యవసరమైంది.. అలాంటి విద్యుత్ చార్జీలను కూటమి ప్రభుత్వం పెంచి ప్రజల నడ్డివిరిస్తోంది.. ప్రతి నెలా బిల్లులు చూసి షాక్‌కు గురవుతున్న కొంతమంది వినియోగదారులను అదనపు లోడ్ పేరుతో విద్యుత్ శాఖ బాదేస్తోంది. పలు గృహ సర్వీసులకు వలంటరీ డిస్క్లోజర్ స్కీమ్ (వీడీఎస్) అంటూ మళ్లీ వడ్డిస్తోంది. లోడ్ వెరిఫికేషన్ పేరుతో ఆన్‌లైన్ ద్వారా నమోదవుతున్న కేసుల్లో పెరిగిన విద్యుత్ లోడ్ ఆధారంగా కిలో వాట్‌కు ఇంత అని చార్జీల మోత మోగిస్తుంది. ఇప్పటికే లోడ్ పెరిగితే కొందరు స్వచ్ఛందంగా దరఖాస్తు చేసుకుని, విద్యుత్ శాఖ విధించే వీడీఎస్‌ను విధి లేక చెల్లిస్తున్నారు. ఇది కాకుండా స్పెషల్ డ్రైవ్ పేరుతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా అదనపు లోడ్‌లపై విద్యుత్ శాఖ దాడులు నిర్వహిస్తుంది. దీంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ముందస్తు సమాచారం లేకుండా, నోటీసులు ఇవ్వకుండా ఇంటి కనెక్షన్లు తొలగించడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలే పెరిగిన విద్యుత్ చార్జీలతో ఇబ్బందులు పడుతుండగా.. ఇప్పుడు అదనపు లోడ్ పేరిట స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి, కనెక్షన్లు తొలగించడం ఏంటని ప్రశ్నిస్తున్నారు.

ఉప్పలగుప్తం మండలం వానపల్లిపాలెంలో స్పెషల్ డ్రైవ్ పేరుతో ఓ ఇంటి విద్యుత్ కనెక్షన్‌ను సిబ్బంది గత గురువారం తొలగించారు. విద్యుత్ వాడకానికి కిలోవాట్ల కేటగిరీల వారీగా అడిషనల్ లోడ్ చార్జీ విధిస్తున్నారు. ఇలా కిలో వాట్‌కు రూ.1,250 చెల్లించాల్సి వస్తోంది. అలాగే సెక్యూరిటీ డిపాజిట్ కింద రూ.600 వసూలు చేస్తున్నారు. ఇలా కిలోవాట్ల వారీగా చార్జీల భారం ఉంటుంది. ఒక రకంగా చెప్పాలంటే ఇది జరిమానా లాంటిదే.



అదనపు లోడ్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా వానపల్లిపాలెంలో ఓ ఇంటి విద్యుత్ కనెక్షన్ తొలగిస్తున్న సిబ్బంది

దీనికే వీడీఎస్ అని పేరు పెట్టి ఈ చార్జీలు వసూలు చేస్తున్నారు. ఆన్‌లైన్ ద్వారా నిర్వహించే లోడ్ వెరిఫికేషన్‌లో ఏ వినియోగదారుడైనా కిలోవాట్ల గీత దాటితే వీడీఎస్ కింద రూ.1,250 చొప్పున చెల్లించాలని తాకీదు వస్తోంది. ఉదాహరణకు పి.గన్నవరం మండలానికి చెందిన ఓ వినియోగదారుడికి వీడీఎస్ కింద రూ.2,500 చెల్లించాలని తాకీదు ఇచ్చారు. సాయంత్రంలోగా రూ.2,500 చెల్లించకుంటే మర్నాడు సాయంత్రానికి రూ.4,500 చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

అయోమయం.. గందరగోళం

లోడ్ వెరిఫికేషన్‌తో ఆన్‌లైన్‌లో ఇలాంటి తాకీదులు జిల్లా వ్యాప్తంగా అనేక మంది వినియోగదారులకు వస్తూండటంతో విషయం అర్థం కాక అయోమయంలో పడుతున్నారు. జిల్లాలో గత మార్చి నుంచి ఈ నెల వరకూ దాదాపు 4,250 గృహ సర్వీసులకు అడిషనల్ లోడ్ పేరుతో వీడీఎస్ అమలు చేసినట్లు తెలిసింది. ఈ 4,250 సర్వీసుల నుంచి అదనపు లోడ్ చార్జీల కింద రూ.78 లక్షల వరకూ వసూలు చేసినట్లు సమాచారం. విద్యుత్ అధికారులు మాత్రం అడిషనల్ లోడ్‌కు చార్జీలు చెల్లించడం వల్ల వినియోగదారుకే మేలని చెప్పుకొస్తున్నారు. విద్యుత్ వినియోగం వివరాలను ఆన్‌లైన్‌లో తెలుసుకునే వెసులుబాటు ఉండటంతో అదనపు లోడ్‌పై విద్యుత్ కార్యాలయాల నుంచి కేసులు నమోదు చేస్తున్నారు. మరోపక్క స్పెషల్ డ్రైవ్‌లతో ఇళ్లకు వెళ్లి అదనపు లోడ్ చార్జీలు చెల్లించకపోతే ఫ్యూజ్ తొలగించాల్సి వస్తుందని సిబ్బంది హెచ్చరిస్తున్నారు. మరి కొంతమంది వినియోగదారులకు ఎలాంటి నోటీసులూ ఇవ్వకుండానే నేరుగా ఇళ్లకు వెళ్లి ఫ్యూజులు తొలగిస్తున్నారు.

ఇబ్బంది పెట్టడం సరికాదు



స్పెషల్ డ్రైవ్ పేరుతో విద్యుత్ సిబ్బంది ఒకేసారి ఇంటికి వచ్చి హడావుడి చేస్తున్నారు. దీంతో, ఇంట్లోని వారు అదేదో దాడిలా కంగారు పడుతున్నారు. నా ఇంటికి అదనపు లోడ్ వినియోగించామంటూ సిబ్బంది వచ్చి ఉన్నపళంగా విద్యుత్ కనెక్షన్ తొలగించారు. ఇది సరికాదు. మా ఇంట్లో చిన్న పిల్లలున్నారు. కరెంట్ లేక రాత్రంతా ఇబ్బంది పడ్డాం. అడిషనల్ చార్జీల వసూళ్లకు ముందుగా నోటీసులిస్తే బాగుంటుంది. ఇలా ఇబ్బంది పెట్టడం సరికాదు.

– దూనబోయిన వెంకటేశ్వరరావు,
వానపల్లిపాలెం, ఉప్పలగుప్తం మండలం

వసూలు చేసే పద్ధతి ఇది కాదు



అదనపు లోడ్ చార్జీల వసూలు కోసం విద్యుత్ శాఖ అధికారులు అనుసరిస్తున్న విధానం సరికాదు. నోటీసులివ్వకుండా కనెక్షన్లు తొలగించడం, స్పెషల్ డ్రైవ్‌ల పేరుతో భయభ్రాంతులకు గురిచేయడం, గడువులోగా చెల్లించకపోతే రూ.వేలల్లో జరిమానాల మాదిరిగా విధించి, ముక్కుపిండి మరీ వసూలు చేయడం వినియోగదారులను తీవ్రంగా ఇబ్బంది పెట్టడమే. తొలుత హెచ్చరికలతో చెప్పాలి. అంతకీ మాట వినకపోతే చివరగా నోటీసు ఇచ్చి కనెక్షన్ తొలగించాలి.

– జీవీఎల్ఎస్ శర్మ,
అధ్యక్షుడు, పట్టణ వినియోగదారుల సంఘం, అమలాపురం

విద్యుదాఘాతానికి యువకుడి మృతి



సీతానగరంలో సుబ్రహ్మణ్యం మృతదేహం వద్ద బంధువులు

కోరుకొండ/సీతానగరం: సీతానగరం మండలం రఘుదేవపురం పరిధిలో నిరొయ్యల చెరువు వద్ద పనిచేస్తున్న కోరుకొండ మండలం కోటి గ్రామానికి చెందిన పేట్ల సుబ్రహ్మణ్యం (27) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. సీతానగరం పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ రేలంగి శ్రీనివాస్ కథనం ప్రకారం.. కోటి గ్రామానికి దగ్గరలోని రఘుదేవపురం పరిధిలో సురవరపు వెంకట అప్పారావు రొయ్యల చెరువు వద్ద పేట్ల సుబ్రహ్మణ్యం కొంతకాలంగా కూలీ నిమిత్తం పనిచేస్తున్నాడు. ఆదివారం చెరువు వద్ద బోరుకు విద్యుత్ సరఫరా రాకపోవడంతో అక్కడే ఉన్న కరెంట్ స్తంభం వద్ద జంపర్ కట్టి, ఎడ్జీ ఫ్యూజ్ వేసే సందర్భంలో ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి గురై పడిపోయాడు. సహచరులు గమనించి సీతానగరం బస్టాండ్ సెంటర్ వద్ద ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇంటి నుంచి చెరువు వద్దకు వెళ్లిన సుబ్రహ్మణ్యం మృతి చెందడంతో తల్లిదండ్రులు, ఇద్దరు చెల్లెళ్లు రోదిస్తున్నారు. మృతుడి తండ్రి శ్రీను వ్యవసాయ కూలీ. తండ్రికి చేదోడుగా ఉంటున్న సుబ్రహ్మణ్యం మృతితో ఆ కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు.

నిత్య జీవితంలో యోగా భాగం కావాలి

- తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు



తిరుమల విద్యా సంస్థలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

రాజమహేంద్రవరం రూరల్: ఆరోగ్యాంధ్రగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు అన్నారు. రాజమహేంద్రవరంలోని తిరుమల జూనియర్ కళాశాలలో యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నున్న తిరుమలరావు మాట్లాడుతూ మారిన ఆహారపు అలవాట్లు, జీవనశైలి నేపథ్యంలో సంపూర్ణ ఆరోగ్యానికి ప్రతి ఒక్కరి జీవితంలో యోగా భాగం కావాలన్నారు. నిత్యం యోగా చేయడం ద్వారా మానసికోల్లాసం కలుగుతుందన్నారు. ఉరుకులు, పరుగుల జీవితంలో కాస్త ఉపశమనాన్ని పొందేందుకు యోగా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. శారీరక, మానసిక ఒత్తిడిని తగ్గించుకునేందుకు నేడు ఎంతోమంది యోగా చేసేందుకు మొగ్గు చూపుతున్నారన్నారు. యోగా టీచర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులతో యోగాసనాలను వేయించారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

జాతీయ తైక్వాండో పోటీలకు తూర్పు క్రీడాకారులు



ఉత్తరాఖండ్‌లో జరిగే జాతీయ తైక్వాండో పోటీలకు వెళ్తున్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఉత్తరాఖండ్‌లో ఈ నెల 23 నుంచి 25 వరకూ జరిగే జాతీయ తైక్వాండో పోటీలకు 18 మంది ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా క్రీడాకారులు పయనమయ్యారని తైక్వాండో సంఘ కార్యదర్శి బి.అర్జునరావు ఆదివారం తెలిపారు. సబ్ జూనియర్స్, జూనియర్స్ విభాగాల్లో జరిగే పోటీలకు 11 మంది బాలికలు, ఏడుగురు బాలురు హాజరవుతున్నారన్నారు. వీరంతా ఇటీవల అనంతపురం జిల్లా తాడిపత్రిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించారన్నారు. జాతీయస్థాయి పోటీలకు హాజరవుతున్న క్రీడాకారులను డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్, తైక్వాండో సంఘ కార్యదర్శి అర్జునరావు, కోచ్‌లు డీఎన్ సత్యనారాయణ, కేవీ సత్యనారాయణ, పి.త్రిమూర్తులు అభినందించి, పతకాలతో తిరిగి రావాలని ఆకాంక్షించారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ సభ్యులు తదితరులు

పిఠాపురం: రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు బాల, బాలికలను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ కాలేజీలో ఆదివారం ఎంపిక చేసినట్లు కోచ్ పి.లక్ష్మణరావు తెలిపారు. మొత్తం 100 మంది రాగా, ఇందులో 12 మంది బాలురు, 12 మంది బాలికలను పోటీలకు ఎంపిక చేశామన్నారు. వీరు ఈ నెల 28, 29 తేదీల్లో కర్నూలులో జరగనున్న రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తరఫున పాల్గొంటారన్నారు. తొలుత ఈ ఎంపిక పోటీలను ఉమ్మడి జిల్లా రగ్బీ అసోసియేషన్ చైర్మన్ వియ్యపు రమణరాజు, సభ్యులు ఎమ్మిడిశెట్టి నాగేంద్రకుమార్, సోము గోవిందరాజు ప్రారంభించారు. న్యాయ నిర్ణేతలుగా సతీష్, పీడీ శేషుకుమారి, కె.నాగలింగేశ్వరరావు, సురేష్, కె.చిన్నబ్బాయి, పవన్ వ్యవహరించారు. ఎంపికైన క్రీడాకారులను డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బి.శ్రీనివాస్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు కె.పద్మనాభం, రగ్బీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దొరబాబు అభినందించారు.

వాడపల్లికి మరింత కీర్తి ప్రతిష్టలు తీసుకువద్దాం

- సిబ్బందికి ఈఓ చక్రధరరావు దిశానిర్దేశం

కొత్తపేట: కోనసీమ తిరుపతిగా, రాష్ట్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి దేవస్థానానికి మరింత కీర్తి ప్రతిష్టలు తీసుకు రావాలనే లక్ష్యానికి సిబ్బంది సహకారం అవసరమని దేవదాయ – ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. వాడపల్లి ఆలయానికి వచ్చే భక్తులకు సౌకర్యాల కల్పనపై ఆదివారం దేవస్థానం కార్యాలయంలో సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. భక్తులకు సమస్యలు ఏమైనా ఉన్నాయా? తదితర అంశాలపై సమీక్షించారు. ఈ విషయాల్లో సిబ్బంది నుంచి సలహాలు, సూచనలు కూడా తీసుకున్నారు. భక్తులు పూర్తి సంతృప్తిగా స్వామి దర్శనం చేసుకుని వెళ్లేలా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా అందరూ చిత్తశుద్ధితో పనిచేద్దామని ఆయన అన్నారు.



దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న దేవస్థానం ఈఓ చక్రధరరావు



వాడపల్లి వేంకటేశ్వర స్వామివారి అష్టోత్తర పూజలో భక్తులు

- వాడపల్లి క్షేత్రంలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి భక్తులు విరివిగా విరాళాలు సమర్పిస్తున్నారు. ఇందులో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం వాస్తవ్యులు భీమా శ్రీధర్, శ్రీవల్లి దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ.1,00,116 విరాళంగా సమర్పించారు. దాతలకు స్వామివారి చిత్రపటాన్ని దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు అందజేశారు. ఆలయంలో నిత్య పూజల్లో భాగంగా స్వామివారి నిత్య కళ్యాణం, ఏడు ప్రదక్షిణలు చేసిన భక్తుల అష్టోత్తర నామార్చన పూజలు జరిగాయి. ఆదివారం స్వామివారి ప్రత్యేక దర్శనం, విశిష్ట దర్శనం, వేదాశీర్వచనం, అన్న ప్రసాద విరాళం, వివిధ సేవలు, లడ్డూ ప్రసాదం విక్రయం, ఆన్‌లైన్ తదితర సేవల దేవస్థానానికి రూ.6,58,733 ఆదాయం వచ్చింది.

పురుగు మందు తాగి.. బస్సు కింద పడి

- యువకుడి బలవన్మరణం



కోదండ రామచంద్రమూర్తి (ఫైల్)

కాకినాడ క్రైం: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. తొలుత పురుగు మందు తాగి, ఆపై బస్సు కింద పడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. రెండో పట్టణ పోలీసుల కథనం ప్రకారం .. కాకినాడ మహాలక్ష్మి నగర్‌లోని రణదీప్‌నగర్‌కు చెందిన కుప్పాల కోదండ రామచంద్రమూర్తి (30) బీచ్ రోడ్‌లో ఉన్న ఓ ఆయిల్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఇతనికి వేట్లపాలేనికి చెందిన సిరితో రెండు నెలల కిందట వివాహమైంది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న రామచంద్రమూర్తి ఆదివారం ఇంటి నుంచి బయటకు వచ్చాడు. మార్గ మధ్యంలో పురుగు మందు కొని తాగాడు. టూ టౌన్ బ్రిడ్జి కింద తన ద్విచక్ర వాహనాన్ని ఉంచి తర్వాత బ్రిడ్జిపైకి వచ్చాడు. తర్వాత బస్టాండ్ నుంచి కోటిపల్లి వెళ్తున్న బస్సు కిందకు దూకాడు. బస్సు కొంతమేర లాక్కెళ్లిపోవడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. అతన్ని స్థానికులు కాకినాడ జీజీహెచ్‌లో చేర్చగా చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందాడు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	18,000 – 18,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	27,500
గటగట (వెయ్యి)	25,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	26,500
గటగట (వెయ్యి)	24,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	17,000 – 17,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	18,000 – 18,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

ఇదిగో సహకారం

- సంఘాల ప్రతినిధులకు నేటితో ముగియనున్న శిక్షణ
- జిల్లా ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహణ



ఏరువాక కేంద్రంలో సహకార ప్రతినిధులకు శిక్షణ

రాజానగరం: వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఏర్పడ్డాయి. ఆయా సంఘాల్లో సభ్యులుగా ఉన్న రైతులకు సాగు రుణాలను అందిస్తూ వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి. పంటల సాగులో అధిక దిగుబడులు సాధించేలా ప్రోత్సహిస్తున్నాయి.. అయితే వివిధ రకాల పంటలకు కాలానుగుణంగా ఏ రకమైన ఎరువులను వాడాలనే పరిజ్ఞానం ఎరువులు పంపిణీ చేసే సిబ్బందికి అంతగా ఉండకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్న సందర్భాలు అనేకం ఉంటున్నాయి. ఈ సమస్యను అధిగమించి, రైతులకు అందించే ఎరువులపై అవగాహన పెంపొందించాలనే ఉద్దేశంతో సహకార సంఘాల ప్రతినిధులకు 'సమగ్ర పోషక యాజమాన్యం'పై రాజానగరం మండలం దివాన్‌చెరువులోని జిల్లా ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో 14 రోజులుగా శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇది సోమవారంతో ముగియనుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన 15 వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు చెందిన 30 మంది ప్రతినిధులు ఇక్కడ శిక్షణ పొందుతున్నారు.

ఏ ఏ అంశాలంటే..

సమగ్ర పోషక యాజమాన్యంపై సర్టిఫికెట్ కోర్సులో భాగంగా 15 రోజులపాటు ఈ శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. నేలలు – రకాలు, వాటిని సారవంతం చేసేందుకు అనుసరించాల్సిన పద్ధతులు, సమస్యాత్మక భూముల సవరణ, మట్టి నమూనాల సేకరణ, పరీక్షలు, జీవన ఎరువులు, ఎరువుల వాడకం, స్థూల, సూక్ష్మ పోషకాల లోపాలను నివారించడం, పంటలో పోషక లోపంతో కలిగే నష్టాలు, వాటిని గుర్తించే విధానం – నివారణ, భూసారం పెంపునకు సమర్థ ఎరువుల వినియోగంపై వివరిస్తున్నారు. అలాగే సూక్ష్మజీవులకు సంబంధించిన జీవన ఎరువులు – విశిష్టత, పంట మార్పిడితో ప్రయోజనాలు, వంటి వివిధ అంశాలపై ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ చల్లా వెంకట శ్రీనివాసరావు, డాక్టర్ మానుకొండ శ్రీనివాస్, మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ పీవీ రమేష్‌లతోపాటు రాజమహేంద్రవరంలోని వ్యవసాయ కళాశాలలోని వివిధ విభాగాల అధ్యాపకులు శిక్షణ ఇస్తున్నారు. అంతేకాకుండా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పలు ప్రాంతాలను సందర్శించి, వివిధ రకాల పంటల సాగుపై అవగాహన కల్పించారు.

కొత్త విషయాలు తెలుసుకున్నా..



సహకార సంఘాల ద్వారా ఎరువులను రైతులకు విక్రయించడమే గానీ వాటి వినియోగం గురించి పెద్దగా అవగాహన ఉండేది కాదు. ఈ శిక్షణ ద్వారా చాలా వరకూ వాటిపై అవగాహన వచ్చింది. అనేక కొత్త విషయాలు తెలుసుకునే అవకాశం లభించింది. స్థూల, సూక్ష్మ పోషకాల గురించి పూర్తిగా తెలుసుకున్నాను.

– మళ్ల శివరామకుమారి,
ఇనుగంటివారిపేట, సీతానగరం మండలం

విజ్ఞానాన్ని పెంచేలా శిక్షణ



సర్టిఫికెట్ కోర్సులో భాగంగా ఏరువాక కేంద్రం ద్వారా సమగ్ర పోషక యాజమాన్యంపై ఇస్తున్న శిక్షణ విజ్ఞానదాయకంగా ఉంది. దీనివల్ల ఎరువుల వినియోగంపై మాకు ఉన్న విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకునే అవకాశం లభించింది. ఇకపై రైతుల సందేహాలను నివృత్తి చేయగలమనే నమ్మకం కలిగింది.

– చన్న వీరవెంకట సుబ్బారావు,
కుమారపురం, రాయవరం మండలం

అవగాహనతో మంచి ఫలితాలు



మారుతున్న కాలాన్ని బట్టి అన్ని రంగాల్లో అనేక మార్పులు వస్తున్నాయి. వాటిని ఆకళింపు చేసుకుని, అవగాహన పెంచుకుంటేనే మంచి ఫలితాలను అందుకోగలుగుతాం. సహకార సంఘాల ద్వారా భాస్వరం, పొటాష్ వంటి పలు రకాల ఎరువులను విక్రయించడమే తెలిసిన మాకు ఈ శిక్షణ ద్వారా వాటివల్ల ఏవిధమైన ఉపయోగాలు ఉన్నాయి, ఏ సమయంలో వాడాలనే విషయాలు అర్థమయ్యాయి.

– తెలగని వెంకట సాయికుమార్,
ఉడుమూడి, కె.గంగవరం మండలం